క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొయినాబాద్: మండల పరిధిలోని మొయినాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్, రెడ్డిపల్లి ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ బానోతు హమునాయక్ తెలిపారు. 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలోని పెద్దమంగళారం, మొయినాబాద్, అమీర్‌గూడ, శ్రీరాంనగర్, సురంగల్, చిలుకూరు, ఎనికేపల్లి, హిమాయత్‌నగర్, ముర్తూజగూడ గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గుర్తించాలన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



కటౌట్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం ఫ్లెక్సీలు, బస్టాప్‌లో వాల్ పోస్టర్‌లను పంచాయతీ సిబ్బంది తొలగించారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో పోస్టర్లను తొలగిస్తూ గోడలపై ఉన్న వాల్‌పోస్టర్లకు తెల్లరంగు రుద్దారు. మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగిస్తున్నామని పేర్కొన్నారు.

ఎన్నికల కోడ్ అమలేది?

పట్టించుకోని అధికారులు



జనవాడలో బీజేపీ నాయకుల బ్యానర్

శంకర్‌పల్లి: ఎన్నికల కోడ్ వచ్చి మూడు రోజులు గడుస్తున్నా మండలంలో ఎక్కడ అమలు కావడం లేదు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా మండలంలో వివిధ గ్రామాల్లో పలు రాజకీయ నాయకుల బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉండగా.. అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో పార్టీల నాయకులు వాల్ పోస్టలను ఇంకా తొలగించలేదు. దీంతో అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోడ్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరుతున్నారు.

యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కుమార్



కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న షాబాద్ దర్శన్, పెంటారెడ్డి

మొయినాబాద్: యువజన కాంగ్రెస్ మొయినాబాద్ మండల ఉపాధ్యక్షుడిగా పెద్దమంగళారంకు చెందిన పులగళ్ల కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్, యువజన కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు పెంటారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు రవీందర్‌రెడ్డి, మహేందర్ ముదిరాజ్, పెంటిబాబు, భాస్కర్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

షాబాద్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెల్స్‌పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, మేనేజర్ భద్రయ్య సూచించారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 264 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి గ్రామ సర్పంచ్ పెంటయ్య, ఆస్పత్రి వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

అన్నీ శక్తి స్వరూపాలే

- 15 నుంచి నవరాత్రోత్సవాలు ప్రారంభం
- దేవీ నవరాత్రులు, బతుకమ్మ పండుగ.. రెండూ అమ్మవారి ఆరాధనలే
- దశావతారాల్లో భక్తులకు దర్శనం
- సిద్ధమైన మంటపాలు



షాబాద్‌లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

షాబాద్: దేవీ నవరాత్రులు, బతుకమ్మ పండుగ.. రెండూ అమ్మవారి ఆరాధనలే. ఆశ్వయుజ మాసంలో సాగే ఈ రెండు వేడుకల్లో అమ్మవార్లను రోజుకో పేరుతో కొలుస్తారు. సకల జగత్తుకు మూలం, త్రిమూర్తులకు శక్తి ప్రధాత, త్రిలోకేశ్వరి సకలాభీష్ట ప్రదాయిని అయిన దేవి నవరాత్రోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. మండలంలో వివిధ గ్రామాల్లో దుర్గామాత ప్రతిమలను ప్రతిష్ఠించనున్నారు. యువజన సంఘాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మంటపాలు సిద్ధమయ్యాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గామాతకు తొలి పూజ నిర్వహిస్తారు.

తొమ్మిది అవతారాలు

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యే నవరాత్రుల్లో తొలిరోజు అమ్మ వారికి కలశస్థాపనం చేసి ప్రతిష్ఠిస్తారు. అప్పటి నుంచి విజయదశమి వరకు శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంటా, కూష్మాండ, స్కంధమాత, కాత్యాయణి, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి అవతారాల్లో అమ్మవారిని భక్తులు కొలుస్తారు.

శైలపుత్రి

చైతన్య శక్తి శైలపుత్రి, త్రిమూర్తి స్వరూపిణి, ఆది పరాశక్తి సతీదేవిగా యోగాగ్నిలో తనువు చాలించింది. తిరిగి పర్వత రాజు హిమవంతునికి శైలపుత్రిదేవిగా జన్మించింది. నంది వాహనంపై త్రిశూల ధారిణిగా స్త్రీ శక్తిని లోకానికి తెలియజేసింది.

బ్రహ్మచారిణి

బ్రహ్మచారిణిగా నియమ నిష్ఠలతో తపస్సు చేసి శివుడిని వరించింది. చేతిలో కమండలంతో మాల ధారిణిగా నిత్య తపో ముద్రాంకితగా దర్శనమిస్తుంది. ఈ రూపంలోని దుర్గామాతను ఆరాధించిన వారికి ఏకాగ్రత దీక్ష అలవడుతుంది.

చంద్రఘంటాదేవి

మనసుకు మార్గదర్శి చంద్రఘంటాదేవి. ఈ రూపంలో అమ్మవారిని ఆరాధించే వారికి శాంతి, సౌభాగ్యాలు కలుగుతాయని నమ్మకం.

కుష్మాండ దుర్గ

శారీరక, మానసిక రుగ్మతలను పారతోలే రూపం కుష్మాండదుర్గ. వర, అంకుశ, పాశ, అభయ ముద్రలతో కూడిన అష్ట భుజాలతో కోటి సూర్య ప్రభలతో ప్రకాశించే జనని అభయ ప్రదాయిని.

స్కంధమాత

మాతృదేవోభవ అనే సందేశాన్ని, అమ్మతత్వాన్ని మానవాళికి ప్రబోధంగా, ఆదిమాతగా కుమార స్వామిని లాలించే అమృత రూపంలో వెలుగొందే దివ్యమూర్తిగా అమ్మవారు దర్శనమిస్తారు.

కాత్యాయణిదేవి

సకల సంసార బంధాలకు కారకురాలు, భవసాగరాల నుంచి మానవుల్ని ఉద్ధరించే శక్తిరూపిణి అయిన అమ్మవారు సింవాహనం అధిరోహించి, కరవాలం చేబుని రాక్షసత్వాన్ని పారదోలే జగదక్షిణిగా శోభిల్లుతుంది.

కాళరాత్రి

ప్రాణకోటి జీవుల్లో గ్రహబాధలు తొలగించి మృత్యువుకే భయం కలిగిస్తూ దుర్గుణాలు, దుష్టశక్తులను పారదోలి సత్యకర్మల్ని ప్రేరేపిస్తూ మంచి బుద్ధిని పెంచుతుంది.

మహాగౌరి

ఆదిపరాశక్తిగా భయంకర కాళ స్వరూపాన్ని విసర్జించిన అమ్మవారు ధవళకాంతితో వెలిగిపోయే మంగళస్వరూపిణిగా మహాగౌరి అవతరించింది. తెల్లని వస్త్రాలు ధరించి, త్రిశూలం చేబూని శతకోటి దివ్య కాంతుల్ని భక్తజనకోటికి అభయ ప్రధానం చేస్తూ శోభిల్లుతుంది.

సిద్ధిధాత్రి

మోక్ష ప్రదాత్రి సిద్ధిధాత్రి. భౌతిక జీవనంలో సర్వ సిద్ధులు అనుగ్రహించే సిద్ధిధాత్రి అష్ట సిద్ధులను, మోక్షమును ప్రసాదిస్తుంది.

అపరాజిత

అపరాజిత శ్రీరాజేశ్వరిదేవి. సర్వమానవ జీవితాల్లో సర్వశక్తికి కేంద్రస్థానం జగజ్జననే. శరన్నవరాత్రుల్లో అమ్మవారికి విశేష అలంకారాలు ముగిశాక విజయ దశమి రోజు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిస్తుంది.

ప్రీతిపాత్రమైన రోజులు

రుద్ర రూపిణి భద్రకాళిగా ఎనిమిదో రోజు జన్మించిన చాముండి తొమ్మిదో రోజు వీరవిహారం చేసి దైత్య సంహారం చేసిందని పురాణాలు చెబుతున్నాయి. పదో రోజు విజయలక్ష్మిగా జనుల ఆనందోత్సవాలకు ప్రతీకగా పూజలందుకుంటుంది. నవరాత్రుల్లో చివరి మూడు రోజులు అత్యంత ప్రీతిపాత్రమైనవి. వీటినే మనం దుర్గాష్టమి, మహార్నవమి, విజయదశమి పేరిట ఉత్సవాలు జరుపుకుంటాం.

సంక్షేమంతోనే చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎంపీపీ రవీందర్‌యాదవ్

ఎంపీపీ రవీందర్‌యాదవ్

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమంతోనే బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు గులాబీ పార్టీలో చేరారు. బుధవారం వీరికి కండువాలు కప్పి రవీందర్ యాదవ్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమంతో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో..

కొందుర్గు: కొందుర్గు మండలం ఉమ్మెంత్యాల గ్రామస్తులు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు ఆ పార్టీ మండల కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అంజయ్య వారిని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, లక్ష్మీనర్సింహ రెడ్డి, శ్రీనివాసురెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ నాయకుల వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్ రూరల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రుషికేశ్ సూచించారు. పట్టణంలో అన్ని రాజకీయ పార్టీల పోస్టర్లను తొలగించిన మున్సిపల్ సిబ్బంది.. అధికార పార్టీ పోస్టర్లను ఎందుకు తీయలేదని ప్రశ్నించారు. పట్టణంలో పోస్టర్లను తొలగించాలని కోరుతూ బుధవారం రుషికేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రచార సాధనాలపై మున్సిపాలిటీ సిబ్బంది కక్ష గడుతూ అధికార పార్టీని వదిలేస్తున్నారని ఆరోపించారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ నాయకులు వంశీకృష్ణ, మురళీ, శ్యాంసుందర్, శివ, పవన్, మఠం శివ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతో రాష్ట్రం సుభిక్షం

- కాంగ్రెస్ వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం
- పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

కేశంపేట: ఇందిరమ్మ రాజ్యంతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను ప్రజలకు వివరించారు. హస్తంపార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే రూ. 500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ. 2,500 ప్రతి నెల అందిస్తామని తెలిపారు. అలాగే ఉద్యోగ నోటిఫికేషన్లను జాబ్ క్యాలెండర్ ప్రకారం అమలు చేస్తామని వివరించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ అన్ని వర్గాలను మోసం చేసిందని మండిపడ్డారు. అనంతరం పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు వివిధ పార్టీల నుంచి హస్తం గూటికి వచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రమేశ్, గిరియాదవ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే బహుజనుల లక్ష్యం

- త్వరలో దొరల పాలనకు చరమగీతం
- నిలుద్దాం, గెలుద్దాం అనే నినాదంతో ముందుకు
- ప్రవీణ్‌కుమార్ సీఎం అయితే సమన్యాయం
- బీఎస్పీ నేతలు విజయఆర్య, బర్కు కృష్ణ యాదవ్



నియామక పత్రం అందుకుంటున్న కృష్ణయాదవ్

షాబాద్: బహుజనుల లక్ష్యం రాజ్యాధికారమేనని, ఇందుకోసం అందరూ పోరాడాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయఆర్య, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. అందరి హక్కులను హరిస్తున్న దొరల పాలనకు చరమగీతం పాడే రోజులు సమీపంలో ఉన్నాయని హెచ్చరించారు. బుధవారం నగరంలోని బీఎస్పీ కార్యాలయంలో కృష్ణ యాదవ్‌కు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీ పని చేస్తోందని చెప్పారు. అధినేత్రి మాయావతి స్ఫూర్తితో బహుజనులకు రాజ్యాధికారంలో వాటా కల్పించేందుకే పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. బహుజనులమంతా కలుద్దాం, నిలుద్దాం, గెలుద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 5 శాతం జనాభా కూడా లేనివారు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి సీఎం పదవులు అనుభవిస్తుంటే.. 90 శాతానికి పైగా ఉన్న బహుజనులు మాత్రం ఇప్పటికీ ఎమ్మెల్యే, మంత్రి పదవుల కోసం భిక్షమెత్తుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. వీటన్నింటికీ పరిష్కారం బహుజనులు రాజ్యాధికారంలోకి రావడమేనని స్పష్టం చేశారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సీఎం అయితే అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శ్రీశైలం, సందీప్, మధు, రఘు, రామకృష్ణ తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి



వినతిపత్రం అందజేస్తున్న పాడిరైతులు

కద్లాల్: పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని పాడి రైతులకు సకాలంలో పాల బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బిల్లులు చెల్లించాలని ఆ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక పాలశీతలీకరణ కేంద్రం మెనేజర్ రాధికను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. కద్లాల్ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని వేలాది మంది రైతులు సాగుతో పాటు కుటుంబానికి తోడ్పాటుగా ఉంటుందని పాడిపోషణ చేపట్టి ఉపాధి పొందుతున్నారని తెలిపారు. పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో పాడి రైతులకు పాల బిల్లురాక 11 రోజులయిందని.. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా పాలసేకరణ కేంద్రాల్లో మొబైల్‌యాప్ ఎంటర్ చేయడానికి కార్యదర్శులకు అనేక ఇబ్బందులు తలెత్తుతు న్నాయని.. ఒక్కో రైతుకు సంబంధించి డాటా ఎంటర్ చేయడానికి 5 నిమిషాల సమయం పడుతుందని.. వేతన కార్యదర్శులకు పూర్తి వెసలుబాటు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాడిరైతుల సంఘం నాయకులు రామకృష్ణ, నాయకులు సుధాకర్ యాదవ్, జితేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, రంగా, లక్ష్మన్, చంద్రయ్య, నారాయణ రెడ్డి, ఘాంస్యనాయక్, ప్రభాకర్‌రెడ్డి, రాజు, కృష్ణయ్య, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

ఇన్‌స్పెక్టర్ సురేశ్

నందిగామ: అనుమతులు లేకుండా బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ సురేశ్ హెచ్చరించారు. బుధవారం నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నామని, అదేవిధంగా గ్రామాల్లో ఎక్కడైనా బెల్టు షాపులు కొనసాగిస్తున్నారనే సమాచారం వచ్చిన వెంటనే దాడులు చేస్తున్నామని చెప్పారు. ఆధారాలు లేకుండా రూ.50 వేలకుపైగా నగదు ఉంటే సీజ్ చేయనున్నట్లు తెలిపారు. కిరాణాషాపు, హోటళ్లు, దాబాల్లో మద్యం విక్రయాలు చేపడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అంజయ్య హ్యాట్రిక్ ఖాయం

- అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం
- నర్సప్పగూడ ఉప సర్పంచ్ శేఖర్

నందిగామ: ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హ్యాట్రిక్ ఖాయమని నర్సప్పగూడ ఉప సర్పంచ్ శేఖర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పాటు నియోజకవర్గంలో అంజయ్య అమలు చేసిన సంక్షేమ పథకాలే తిరిగి గెలిపిస్తాయని జోస్యం చెప్పారు. నర్సప్పగూడలో బుధవారం శేఖర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి పనులను షాద్‌నగర్ నియోజకవర్గంలో చేపట్టారని గుర్తుచేశారు. నర్సప్పగూడ గ్రామంలో ప్రతి రోడ్డు సీసీరోడ్డుగా మార్చేందుకు కావాల్సినన్ని నిధులు మంజూరు చేశారని, ఎస్సీ కమ్యూనిటీ భవనం మంజూరు చేశారని చెప్పారు.

కానిస్టేబుల్ అభ్యర్థికి సన్మానం

షాద్‌నగర్ రూరల్: కొందుర్గు మండలం తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, వెంకటేశ్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితంలో ఏదైనా సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. విధి నిర్వహణలో విలువలను పాటిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలను అందిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ డైరెక్టర్లు శంకర్‌గౌడ్, శేఖర్, మహేశ్వర్, జంగరాజ్, అబ్దుల్‌రావూఫ్, నాయకులు దిలీప్, ప్రవీణ్‌కుమార్, నర్సింహ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ‘కోడ్’ అమలు చేయాలి

- ఉపాధి పనులను కొనసాగించాలి
- ఏపీడీ చరణ్‌గౌతం
- పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ చరణ్‌గౌతం

షాద్‌నగర్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొనసాగుతున్న ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఏపీడీ చరణ్‌గౌతం అన్నారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీడీ చరణ్‌గౌతం హాజరై మాట్లాడుతూ.. రాజకీయ పార్టీకి సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని ఆదేశించారు. కూలీలు అధిక సంఖ్యలో వచ్చే విధంగా చూడాలని సూచించారు. దసరా సెలవుల్లో విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించాలని అన్నారు. విద్యార్థులు సెలవులను వృథా చేయకుండా ఆటలపై ఆసక్తి పెంపొందించుకొని పోటీల్లో రాణించాలని సూచించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, టీషర్టులను అందజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ అరుణ, ఎంపీఓ గిరిరాజ్, పంచాయితీ కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, తేజస్విని, స్వప్న, శంకర్, ప్రమోద్, శ్రీలత, సరిత, పాండురంగారెడ్డి, యాదయ్య, అనిల్, జగదీశ్, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం



గ్యారంటీ కార్డులతో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ స్కీములను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. బుధవారం పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డోర్ టూ డోర్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూధన్‌రెడ్డి, కౌన్సిలర్లు కోశిక ఐలయ్య, సునీల్, నాయకులు ధన్‌రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

తలకొండపల్లి: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్‌ను గెలుపించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని, పార్టీ గెలుపును ఎవ్వరూ ఆపలేరని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 80 నుంచి 86 సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు.

ఇంటింటి ప్రచారం

ఇబ్రహీంపట్నం: ఆరు గ్యారంటీలపై ఇబ్రహీంపట్నంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు పరిచే స్కీంల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య



నిరసన తెలుపుతున్న అంజయ్య, నాయకులు

యాచారం: ఉపాధి కూలీలకు వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. యాచారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం ఉపాధి కూలీలతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులు చేసి నాలుగైదు నెలలు గడుస్తున్నా కూలీలకు డబ్బులు అందడం లేదని అన్నారు. ఉపాధి కూలీలకు ఆధార్ అనుసందానంతో ఆందోళన వ్యక్తమవుతుందని అన్నారు. ఉపాధి పనులకు బడ్జెట్ తగ్గించడం దారుణమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, శివ, కృష్ణ, లక్ష్మణ్, బ్రహ్మయ్య, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించండి

గొర్ల పెంపకం దారుల జిల్లా కార్యవర్గ సభ్యుడు పెంటయ్య

తలకొండపల్లి: హక్కుల సాధనకు ఉద్యమించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు జల్లెల పెంటయ్యయాదవ్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పడకల్‌లో మాట్లాడుతూ.. గొల్ల కురుమలకు గొర్రెల పథకం ద్వారా ఇవ్వాల్సిన జీవాలు మొదటి విడత పూర్తి కాకపోగా, రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టకపోవడం దారుణమన్నారు. 50 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరికి రూ.5వేల పింఛన్, ప్రమాదంలో చనిపోయిన పెంపకందారులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రతి గొర్రెలకాపరికి రూ.లక్షతో షెడ్ నిర్మించాలని, గొర్రెల ఫారం ఏర్పాటుకు రూ.30 లక్షల రుణం, గొర్రెలకు ఇన్సూరెన్స్, ప్రతి గ్రామ సొసైటీకీ కమ్యూనిటీ భవనం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెంపకందారుల సభ్యులు పాల్గొన్నారు.